సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
నేటి దినపత్రిక
ఎన్టీఆర్ - కృష్ణా
గురువారం 6 ఫిబ్రవరి 2025 పేజీలు 8

పంట పొలాల్లో..

# నీటి కుంటలు

## పొలం పచ్చగా.. సమాజం సుభిక్షంగా..



- కార్యక్రమం ఒకటే.. ప్రయోజనాలు అనేకం
- రైతులకు కార్యక్రమం ప్రాధాన్యతను తెలియజెప్పండి
- ఒక రైతు.. ఒక నీటి కుంట నినాదంతో ముందుకెళ్లాలి
- ఎన్టీఆర్ జిల్లా, క్షేత్రస్థాయి అధికారులతో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** పంట పొలాల్లో నీటి కుంటల (ఫార్మ్ పాండ్స్)తో పొలం పచ్చగా.. సమాజం సుభిక్షంగా ఉంటుందని, ఒక కార్యక్రమంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి జిల్లాస్థాయి అధికారులతో కలిసి ఆర్‌డీవోలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు మిగతా 2లో

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



## కృష్ణాజిల్లా కలెక్టర్ డీ కే బాలాజీ

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించి లబ్ధి చేకూర్చాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రగతిపై వైద్య ఆరోగ్య, సాంఘిక, గిరిజన, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమ శాఖలు, విభిన్న ప్రతిభా వంతులు హిజ్రాలు వయోవృద్ధుల సంక్షేమం, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మున్సిపాలిటీ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మిగతా 2లో...



# అత్యధిక మెజార్టీతో.. ఆలపాటిని గెలిపించండి

## రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్

**పామర్రు ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్ :** ఈనెల 27వ తేదీన జరగనున్న కృష్ణ గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలపరిచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, కృష్ణా జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. విద్యావంతుడు, సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి, మిగతా 2లో

వైసీపీ మత్తు నుండి...

# కాంట్రాక్టర్లు బయటకు రావాలి

- ఇరిగేషన్ పనుల్లో దోపిడీ చేద్దాం అనుకుంటే కుదరదు
- నందివాడ మండలంలోని దోసపాడు ఛానల్ ను పరిశీలించిన ఎమ్మెల్యే రాము
- నిర్వహణ సక్రమంగా లేక కాలవ శిథిలావస్థకు చేరుకోవడంపై ఆగ్రహం
- నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు సూచనలు



**నందివాడ, మేజర్ న్యూస్ :** కాంట్రాక్టర్లు అవినీతి వైసీపీ మత్తు నుండి బయటకు రావాలని... ఇరిగేషన్ పనుల్లో దోపిడీ చేద్దాం అనుకుంటే కూటమి ప్రభుత్వంలో కుదరదని ఎమ్మెల్యే రాము అన్నారు. మండలంలోని దోసపాడు ఛానల్ కాలువను ఎమ్మెల్యే రాము బుధవారం పరిశీలించారు. నెహ్రూ డ్రాప్ నుండి ఇలపర్రు రెగ్యులేటర్ కింద మిగతా 2లో...



# దళితుడిపై దాష్టికం

2లో

- వైసీపీ సానుభూతిపరుడు ఇంటికి తాగునీటి సరఫరా నిలిపివేసిన పంచాయతీరాజ్ సిబ్బంది
- దళిత కుటుంబాలకు అండగా ఉంటా..
- నియోజకవర్గ ఇంచార్జి తన్నీరు నాగేశ్వరరావు

(మొదటిపేజీ తరువాయి)

## పంట పొలాల్లో నీటి కుంటలు



తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుతెన్నులతో పాటు సగటు రోజువారీ వేతనాలు, పశువుల షెడ్లు, పంట పొలాల్లో నీటి కుంటల పనులు తదితరాల్లో పురోగతిని సమీక్షించారు. ఇప్పటికే ప్రారంభించిన పనుల సత్వర పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నరేగా అనుసంధానంతో పైసా ఖర్చు లేకుండా రైతుల పొలాల్లో నీటి కుంటల వల్ల పంటకు కావాల్సిన నీరు అందడమే కాకుండా భూగర్భ జలాల వృద్ధికీ దోహదం చేస్తాయన్నారు. మృత్తికా, పోషకాల క్రమక్షయాన్ని అడ్డుకునేందుకు ఈ కుంటలు ఉపయోగపడతాయని వివరించారు. ఇన్ని ప్రయోజనాలున్న నీటి కుంటల గురించి రైతులకు పొలం పిలుస్తోంది వంటి కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. ఒక రైతు ఒక నీటి కుంట నినాదంతో ముందు కెళ్లాలని.. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. జిల్లాలో 289 గ్రామ పంచాయతీల పరిధిలో 2,713 కుంటలు మంజూరయ్యాయని.. ఇప్పటికే 203 కుంటలు గ్రౌండింగ్ అయ్యాయని, మిగిలిన వాటికీ స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని పనులు ప్రారంభించి, పూర్తయ్యేలా చూడాలన్నారు. నరేగా–పల్లె పండగ కార్యక్రమం కింద పశువుల షెడ్లకు సంబంధించి 746 పనులు మంజూరు కాగా, 420 పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులపైనా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమీక్షించి, ఫిబ్రవరి 15లోగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. అదేవిధంగా సీసీ రోడ్ల పనులనూ యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. ఈ నెల 11లోగా శ్రమ శక్తి సంఘాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిచేయాలని ఆదేశించారు. నరేగా ద్వారా వీలైనంత ఎక్కువ మందికి పని కల్పించాలని, పథకం కింద చేపట్టేందుకు గ్రామాభివృద్ధి, వ్యక్తిగత, సామాజిక పనులను గుర్తించాలని సూచించారు. ఉపాధి పనులపై ఎంపీడీవోలు ప్రతివారం సమావేశాలు నిర్వహించాలన్నారు. రూ. 300 రోజువారీ సగటు వేతన లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. సమావేశంలో డ్వామా పీడీ ఎ.రాము, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి



మంగళవారం కలెక్టరేట్లో జరిగిన కేంద్ర ప్రభుత్వ పథకాల సద్వినియోగంపై సమీక్షకు కొనసాగింపుగా ఈ సమావేశం నిర్వహించి పథకాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వివిధ వర్గాల ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అదేవిధంగా కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థులకు అనేక ఉపకారవేతనాలు (స్కాలర్‌షిప్‌లు) ఇస్తూ చేయూతను అందిస్తోందన్నారు. ఆయా పథకాలకు అర్హులను గుర్తించి వారికి లబ్ధి చేకూర్చాలని సూచించారు.ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాల విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ, అదేవిధంగా విదేశీ విద్యను అభ్యసించే వారికి ఆర్థిక సాయం, విద్య కోసం అవసరమైన వారికి తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు అందించే పథకాలు, స్వయం ఉపాధి కోసం పీఎం ముద్రా యోజన రుణాలు వంటి ఎన్నో పథకాలు ఉన్నాయని, వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎస్ శర్మిష్ట, ఐసిడిఎస్ పిడి ఎం.ఎన్ రాణి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫణి ధూర్జటి, విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కామరాజు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీంద్ర రెడ్డి, శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గ్రామ పార్టీ అధ్యక్షులుని పరామర్శించిన ఎమ్మెల్యే



**విజయవాడ రూరల్ మేజర్ న్యూస్ :** విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొర్రా పున్నారావు మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు విజయవాడలోని ఆయుష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొర్రా పున్నారావు ని బుధవారం పరామర్శించారు. ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు

# అత్యధిక మెజార్టీతో ఆలపాటిని గెలిపించండి



(మొదటిపేజీ తరువాయి)

మాజీ మంత్రి అయిన రాజేంద్ర ప్రసాద్ ను చంద్రబాబు నాయుడు అభ్యర్థిగా ఎంపిక చేశారని, అటువంటి వ్యక్తిని గెలిపించి చట్టసభకు పంపడం ద్వారా పట్టభద్రులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు అవకాశం కలుగుతుందన్నారు. గత ప్రభుత్వం పట్టభద్రులను పట్టించుకోకుండా నిరుద్యోగులుగా వదిలేసిందని, యువతను, విద్యార్థులను గంజాయికి బానిసలుగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే దాదాపు ఆరు లక్షల 50 వేల కోట్ల రూపాయల పెట్టుబడులను రాష్ట్రానికి సాధించామని తద్వారా రానున్న రెండు సంవత్సరాలలో ఐదు లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించబోతున్నామన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో శాసన మండలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటిని గెలిపించడం ద్వారా తమకు మద్దతు ఇవ్వాలని, శాసన మండలిలో విద్యావంతుల తరఫున తన వాణిని వినిపించగల సమర్థుడైన నాయకుడని ఆయన పేర్కొన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్న తాను పామర్రు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓట్లను అభ్యర్థించేం దుకు వచ్చానన్నారు. ఈ సందర్భంగా ఆయన పామర్రులో పలువురు పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. అనంతరం స్థానిక శ్రీ కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి తమ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆయనతోపాటు స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజా కూడా పాల్గొని తప్పనిసరిగా తమ అభ్యర్థి రాజేంద్రప్రసాద్ ను గెలిపించేందుకు ఉపాధ్యాయు లు పూర్తిస్థాయి సహకారం అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్, పార్టీ నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, మండపాక శంకర్ బాబు, దాలిపర్తి ప్రసాదరావు, చాట్ల రమేష్, కేదరాశిపల్లి శ్రీను, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ మత్తు నుండి కాంట్రాక్టర్లు బయటకు రావాలి



(మొదటిపేజీ తరువాయి)



వరకు రైతులు, అధికారులతో కలిసి ఆయన ద్విచక్ర వాహనంపై పర్యటించారు. కాలువలో తూడు,గుర్రపు డెక్క పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా ఉండడాన్ని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కాలువ నిర్వహణ పనులు అంతంతమాత్రంగా చేయడంతో దోసపాడు ఛానల్ శిథిలావస్థకు చేరుకోవడాన్ని ఎమ్మెల్యే రాము గుర్తించారు. నీటి ప్రవాహానికి అడ్డుగా తూడు, గుర్రపు డెక్కు తొలగింపు పనులు అంతంత మాత్రం గానే జరుగుతున్నాయని రైతులు ఎమ్మెల్యే రాముకు తెలియజేశారు. కాలువలో నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. గుడివాడ నియోజకవర్గంలోనీ ఇరిగేషన్ కాలువల్లో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనుల్లో అలసత్వంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి మరోసారి ఇలా జరగకుండా చూసుకుంటానని రైతులకు ఎమ్మెల్యే రాము హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మీడియాతో మాట్లాడుతూ.... రాష్ట్రంలో ఇరిగేషన్, డ్రైనేజీ కాలువలో పనులను డబ్బులు తెచ్చే యంత్రాలుగా గత ప్రభుత్వం మార్చేసిందని మండిపడ్డారు. వైసీపీ దోపిడీకి ఇరిగేషన్ కాలువలు దారుణ పరిస్థితిలో ఉన్నాయని ఎమ్మెల్యే రాము ఆవేదన వ్యక్తం చేశారు. కాలువలలో పనులేం చేయక్కర్లేదనే ఆలోచనతో కాంట్రాక్ట్ దక్కించుకున్న వారు... సక్రమంగా పనులు చేయకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంలో దోపిడీ ఇక కుదరదని, కాంట్రాక్టర్లు డబ్బులు జేబుల్లో వేసుకోవడమే కాక నిబంధనల ప్రకారం కాలువల నిర్వహణ చేయాల్సిందేనని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. రైతులకు మంచి జరిగేలా నీటి సంఘాలు దృష్టి పెట్టాలన్నారు. వరదల్లో దెబ్బతిన్న దోసపాడు ఛానల్ ను దిగువ వరకు ఆధునికరించి... భవిష్యత్తులో వరదలు వస్తే ముంపు సమస్య రాకుండా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము పేర్కొన్నారు.

ఈ పర్యటనలో ఇరిగేషన్ డి.ఈ భరత్, డీ.సీ చైర్మన్లు బొమ్మన బోయిన ఏసుబాబు, యార్లగడ్డ రవి, వైస్ చైర్మన్ నంబూరి రాకేష్, డబ్ల్యూ డబ్ల్యూ ఏ అధ్యక్షుడు సురేష్, మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, మండల టిడిపి నాయకులు చాట్రగడ్డ రవికుమార్,ఉప్పల వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, తుమ్మలపల్లి సర్పంచ్ రాధాకృష్ణ,రాపూరి ఏడుకొండలు, నెరుసు నాగరాజు, డ్రైనేజీ ఏఈలు అనిల్,అరుణ్, పలువురు నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.



# దళితుడిపై దాష్టికం

### వైసీపీ సానుభూతిపరుడు ఇంటికి తాగునీటి సరఫరా నిలిపివేసిన పంచాయతీరాజ్ సిబ్బంది

### దళిత కుటుంబాలకు అండగా ఉంటా..

### నియోజకవర్గ ఇంచార్జి తన్నీరు నాగేశ్వరరావు



**జగ్గయ్యపేట, ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్ :** మండలంలో గండ్రాయి గ్రామం దళిత పేద కుటుంబానికి చెందిన బండి రాజు ఇంటి దగ్గర డ్రైనేజీ పనులు నిమిత్తం తాగునీరు సరఫరా నిలిపివేసిన పంచాయితీ శాఖ అధికారులు. కక్షపూరితంగానే తాగునీటి నిలిపారని చుట్టూ ఉన్న ప్రజలు వాపోయారు. ప్రత్యామ్నాయంగా తాగునీటి నీ అందించే ఏర్పాటు చేయని వైనం పంచాయతీ అధికారులు. ఈ విషయాన్ని గ్రామ నాయకులు ద్వారా నియోజకవర్గ ఇన్చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు తెలుసుకోవటం జరిగింది. బుధవారం గ్రామానికి వెళ్లి గ్రామ నాయకులతో కలిసి బండి రాజు ఇంటి వద్ద సమస్యను పరిశీలించి, తాగునీటిని అందించకపోవడంపై ఖండించారు. తాగే నీరు దగ్గర కూడా రాజకీయాలు నీచ బుద్ధి కూటమి ప్రభుత్వానిదని ఆయన దుయ్యబట్టారు.మా పార్టీ సానుభూతి పరులైన దళితుల జోలికొస్తే సహించేదే లేదన్నారు.దళితులకు ఏ కష్టమొచ్చిన నేను ముందుండి పోరాటం చేస్తా అని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. వెంటనే గ్రామ సెక్రెటరీ సంధ్యా తో చరవాణితో మాట్లాడి తాగునీరు సమస్యను వివరించడం జరిగింది. సెక్రటరీ సంధ్యా స్పందించి రెండు మూడు రోజుల్లో తాగునీటిని సరఫరా అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గజ్జలకొండ కృష్ణ మరణం పార్టీకి తీరని లోటు

## యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్



**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** 22వ డివిజన్లో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి గజ్జలకొండ కృష్ణ ఎంతో కృషి చేశారని ఆయన మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటుని యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ పేర్కొన్నారు. గజ్జల కొండ కృష్ణ గత 20 సంవత్సరాల నుంచి తెలుగుదేశం పార్టీ క్రియాశీలక సభ్యులుగా ఉంటూ ప్రస్తుతం డివిజన్ పార్టీ ఉపాధ్యక్షులుగా కొనసాగుతున్నా రని ప్రతి ఎన్నికల్లో గద్దె రామ్మోహన్ గెలుపు కోసం ఎంతగానో కృషి చేశారని గజ్జలకొండ కృష్ణ మరణం తెలుగుదేశం పార్టీతో పాటు మాకు ఎంతో తీరనిదని తెలిపారు. నేటి ఉదయం తెల్లవారుజామున గజ్జలకొండ కృష్ణ గుండెపోటుతో హఠాత్మరణం పొందడంతో గద్దె క్రాంతి కుమార్ కృష్ణలంకలోని గజ్జలకొండ కృష్ణ ఇంటి వద్దకు వెళ్లి ఆయన భౌతిక కాయానికి తెలుగుదేశం జెండా కప్పి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులు నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలిశెట్టి అన్నారావు, చందన సురేష్, బాలబొమ్మ రంగారావు, పెద్ది అన్నారావు, తోట శ్రీనివాస్, ఈడే పరశురాం, మాధవి, టెంటు రాజేష్, తగరంపూడి మళ్ళీ, కొండేటి వెంకట్రావు, దత్తులూరు కాశి, తోట రాజేష్ తదితరులు ఉన్నారు.

## చంద్రబాబు కాన్వాయ్ డ్రైవర్ అమీన్ మృతి

### నివాళులర్పించిన గద్దె క్రాంతి కుమార్



**విజయవాడ మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కాన్వాయ్ డ్రైవర్‌గా పని చేస్తున్న అమీన్ గుండెపోటుతో మరణించారు. 12వ డివిజన్ ఫరూక్ నగర్ లోని అమీన్ ఇంటి వద్దకు టిడిపి యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ వెళ్లి ఆయన భౌతికఖాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులు పరామర్శించారు. గద్దె క్రాంతి కుమార్‌తో పాటు డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి సాయిబాబు ఉన్నారు.



## సోను సూద్ ఫౌండేషన్‌తో షావోమి ఇండియా భాగస్వామ్యం

**విజయవాడ మేజర్ న్యూస్ :** ఆరోగ్య సంరక్షణ, సమాజ సంక్షేమం పట్ల తన నిబద్ధతను మరింత పెంచుకుంటున్న షావోమి ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఆరోగ్య సంరక్షణ మద్దతును పెంచేందుకు సూద్ ఛారిటీ ఫౌండేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ప్రయత్నంలో భాగంగా, రాష్ట్రంలోని వెనుకబడిన జిల్లాల్లో అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను పెంపొందించేందుకు, ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు సూద్ ఛారిటీ ఫౌండేషన్, షావోమి ఇండియా సంయుక్తంగా నాలుగు టైప్ బి (పేషెంట్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్స్) అంబులెన్స్‌లను విరాళంగా ఇచ్చాయి. అధికారికంగా అంబులెన్సులను అందజేసే కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, నటుడు, సమాజ సేవకుడు, సూద్ ఛారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సోను సూద్, షావోమి ఇండియా చీఫ్ పీపుల్ ఆఫీసర్ వరుణ్ మదన్ తదితరులు పాల్గొన్నారు.

## మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకున్న జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు



**మోపిదేవి మేజర్ న్యూస్ :** జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానాన్ని బుధవారం సాయంత్రం కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ దంపతులు కుటుంబ సమేతంగా స్వామివారి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు కలెక్టర్ బాలాజీ దంపతులకు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి నాగ పుట్ట వద్ద పాలు పోసి, నాగ పుట్ట పూజ నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో కలెక్టర్ దంపతులను ఘనంగా సత్కరించారు. ఆలయ అర్చకులు వేద పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికారు.

# సమగ్ర అవగాహన, స్క్రీనింగ్ కార్యక్రమాలతో ఒమేగా హాస్పిటల్ లో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం

**గుంటూరు మేజర్ న్యూస్:** ప్రముఖ సమగ్ర క్యాన్సర్ కేంద్రమైన గుంటూరు ఒమేగా హాస్పిటల్ యునైటెడ్ బై యునిక్ అనే నేపథ్యంతో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని నిర్వహించింది. క్యాన్సర్ పట్ల అవగాహన, ముందస్తు గుర్తింపు, రోగి మద్దతు లక్ష్యంగా ప్రభావవంతమైన కార్యక్రమాలను దీనిలో భాగంగా నిర్వహించారు. మహిళల క్యాన్సర్ స్క్రీనింగ్‌ను డా.ఎం.జి.నాగకిషోర్, డి.ఎం.హెచ్.ఓ డా.విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఒమేగా హాస్పిటల్ డైరెక్టర్, చీఫ్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఎం.జి. నాగకిషోర్ మాట్లాడుతూ 2017 ఫిబ్రవరి 3న తాము కార్యకలాపాలను ప్రారంభించిన నాటి నుండి ఆసుపత్రి యొక్క అద్భుతమైన ప్రయాణాన్ని వెల్లడించారు. గత ఏడు సంవత్సరాలలో తాము ఒక లక్ష మందికి పైగా రోగులకు విజయ వంతంగా చికిత్స అందించామన్నారు. క్యాన్సర్ చికిత్సలో ఆసుపత్రి అగ్రగామి గా నిలుస్తుందన్న ఆయన ప్రత్యేక వైద్య, శస్త్రచికిత్స, రేడియేషన్ ఆంకాలజీ సేవలు సహా సమగ్రమైన క్యాన్సర్ కేర్ ను తాము అందిస్తున్నామన్నారు. మహిళా ఆంకాలజిస్టుల ప్రత్యేక బృందం తమ దగ్గర ఉందని నొక్కి చెప్పారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్యాన్సర్ పట్ల అవగాహన మెరుగుప రచటం, ముందస్తు గుర్తింపు పట్ల తమ నిబద్ధతను బలోపేతం చేయడానికి, క్యాన్సర్ ముందస్తు గుర్తింపు, వైద్య సలహాను పొందగలరనే భరోసా అందిస్తూ గుంటూరు, విజయవాడ అంతటా మొబైల్ బస్ క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించింది. మామోగ్రఫీ, పాప్ స్మియర్ సహా పలు పరీక్షలతో పాటుగా ఆంకాలజిస్ట్ కన్సల్టేషన్‌తో సహా రూ. 999 ధరకు మహిళల కోసం ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ ప్యాకేజీ తీసుకురావటం, గర్భాశయ క్యాన్సర్ టీకా డ్రైవ్‌లను




నిర్వహించటం, వైద్య, ఆరోగ్య శాఖ, గుంటూరు నేతృత్వంలో వైద్య, పారామెడికల్ సిబ్బందికి ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఎం.జి. నాగకిషోర్, ఆంకాలజిస్టుల బృందం నేతృత్వంలోని క్యాన్సర్ సర్వైవర్లతో ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహించి స్ఫూర్తిని రేకెత్తించటం చేశారు.

### మార్గదర్శక క్యాన్సర్ సంరక్షణ కార్యక్రమాలు

గుంటూరులోని ఒమేగా హాస్పిటల్, వినూత్న క్యాన్సర్ సంరక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది. వాటిలో దక్షిణ మధ్య రైల్వే సహకారంతో మొబైల్ ట్రైన్ హెల్త్ క్యాంపులను ప్రారంభించించటం ఒకటి కాగా, ఆంధ్రప్రదేశ్‌లో మల్టీ-డిసిప్లినరీ ట్యూమర్ బోర్డులను ప్రవేశపెట్టిన మొదటి హాస్పిటల్ గా కూడా ఒమేగా ఖ్యాతి గడించింది. ఈ కార్యక్రమాలను గుంటూరు ఒమేగా హాస్పిటల్ సెంటర్ హెడ్ సిహెచ్. హేమకుమార్, జీసీవోవో మహేంద్ర పాలా, సీఎంవో శ్రీకాంత్ సమన్వయం చేశారు.



## మాధవరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వర్ల

**పామర్రు ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ పరిధిలోని పమిడిముక్కల మండలం వీరంకిలాకులో రాజులపాటి మాధవరావు (70) ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్, స్థానిక శాసనసభ్యుడు వర్ల కుమార్ రాజాలు బుధవారం పరామర్శించారు. మాధవరావు పెద్ద కుమారుడు అంకబాబు పెద్దాపురంలో సిసిఎస్ సిఐ గా పనిచేస్తుండగా చిన్న కుమారుడు వెంకటప్పయ్య మంత్రి సుభాష్ వద్ద గన్ మన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ కారణంగా అదే జిల్లాకు చెందిన మంత్రి సుభాష్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా మాధవరావు చిత్రపటానికి మంత్రి సుభాష్, ఎమ్మెల్యే కుమార్ రాజాలు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మాధవరావు కుమారులు అంకబాబు, వెంకటప్పయ్యలను మంత్రి పరామర్శించి వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు వల్లూరుపల్లి గణేష్, గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, తెలుగుదేశం పార్టీ నాయకులు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, జక్కా శ్రీనివాసరావు, లింగమనేని బాబురావు, కృష్ణాపురం డిసి చైర్మన్ నాదెండ్ల సుబ్రహ్మణ్యం, పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## పలువురి పార్థివదేహాలకు మంత్రి సుభాష్, ఎమ్మెల్యే వర్ల నివాళులు



**పామర్రు ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్ :** పామర్రు నియోజకవర్గ పరిధిలోని పమిడి ముక్కల మండలంలో వివిధ అనారోగ్య కారణాలతో మృతి చెందిన పలువురి



పార్థివదేహాలకు మంత్రి వాసంశెట్టి సుభాష్, స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాలు నివాళులర్పించారు. బుధవారం మండలంలో పర్యటించిన కార్మిక శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎమ్మెల్యే కుమార్ రాజా లు పమిడిముక్కల గ్రామంలో గురువిందపల్లి మత్తయ్య మృతిచెందగా ఆయన భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే అదే గ్రామంలో బుర్రే సుబ్బమ్మ మరణించగా ఆమె భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణాపురం గ్రామంలో మృతి చెందిన కోమటి కోటేశ్వరరావు పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియపరిచారు. ఈ కార్యక్రమాలలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే కుమార్ రాజాలతోపాటు పమిడిముక్కల గ్రామ సర్పంచ్ ముళ్ళపూడి సునీత, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, కృష్ణాపురం డిసి చైర్మన్ నాదెండ్ల సుబ్రహ్మణ్యం, తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కా శ్రీనివాసరావు, చాట్ల రమేష్, దాలిపర్తి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## చావా సతీష్ ఆధ్వర్యంలో చైర్మన్‌కు సన్మానం



**నందిగామ, ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్:** మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన మండవ కృష్ణకుమారి శ్రీనివాస్ కు టిడిపి నాయకులు చావా సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సతీష్ యూత్ సభ్యులు గోపినాథ్, ఎం ప్రవీణ్, బి నాగరాజు, టి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం



**నందిగామ, ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్:** పట్టణంలోని కాకాని నగర్ ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కార్యాలయంలో క్లస్టర్,యూనిట్ ఇన్చార్జిలు, సమన్వయ కమిటీ సభ్యులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ పరిశీలకులు, మాజీ శాసనసభ్యులు రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఏపీ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రకటన తెలిపారు. కావున ప్రతి ఒక్కరు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

## సాగర్ జలాలను సద్వినియోగం చేసుకోవాలి



**నందిగామ, ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్:** డి వి ఆర్ బ్రాంచ్ కెనాల్ లో సాగర్ జలాల విడుదలను నాగార్జున సాగర్ లాల్ బహదూర్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కోట వీరబాబు పరిశీలించారు.డి వి ఆర్ బ్రాంచ్ కెనాల్ నుండి శన గపాడు మేజర్ 1, 2 లకు విడుదల అయిన నీటిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణా నుండి ఆంధ్రలోని గంద్రయి వరకు 518 క్యూసెక్కుల నీరు వస్తుందని, గౌరవరం రెగ్యులేటర్ వరకు 400 టీ యం సి నీరు చేరుతుందని, బుధవారం నుండి గురువారం సాయంత్రం వరకు గౌరవరం ఎగువన ఉన్న శనగ పాడు మేజర్ల కు నీటిని పూర్తి స్థాయిలో ఇవ్వడం జరుగుతుందని,శుక్రవారం, శనివారం పూర్తి స్థాయిలో ఏటూరు మేజర్ కు నీరు ఇవ్వడం జరుగుతుందని తెలియజేసారు.వస్తున్న నీటిని అవసరం మేరకు వాడుకోవాలని, నీటిని వృధా చేయవద్దని ఆయన కోరారు.

## కిన్నెరా ఫౌండేషన్ దాతృత్వం ఆదర్శనీయం



**చల్లపల్లి మేజర్ న్యూస్ :** కిన్నెరా ఫౌండేషన్ దాతృత్వం అభినందనీయమని పలువురు వక్తలు ప్రశాంశించారు. పుట్టుకతో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల చిన్నారి హేశ్విత ను ఆదుకునేందుకు హైదరాబాద్ కు చెందిన కిన్నెరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంఠంనేని రాజగోపాల్- కృష్ణ దంపతులు రూ 10 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందించి తమ దాత్రుత్వం చాటుకున్నారు. కృష్ణా జిల్లా ఉయ్యూరు కు చెందిన హేస్విత పుట్టుకతో తలసేమియాతో బాధ పడుతుంది. చిన్నారి వైద్య ఖర్చులకు రూ. 25 లక్షలు అవసరం కాగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సీఎంఆర్ఎఫ్ సహాయం రూ.పది లక్షలు మంజూరు కాగా, మరో రూ.15 లక్షలు అవసరం ఉన్న నేపథ్యంలో చిన్నారి తల్లి వక్కలగడ్డ చెందిన కమలా నెహ్రూ మహిళా మండలి సభ్యులను ఆశ్రయించింది. సభ్యురాలు హనుమానుల రాణి కుమారి తమ బంధు వర్గ గ్రూపులో విషయాన్ని పోస్ట్ చేయగా విదేశాల్లో ఉన్న తమ బంధువులు, కిన్నెర ఫౌండేషన్ ద్వారా సేకరించిన రూ పది లక్షల చెక్కును చిన్నారి తల్లికి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ముందుకొచ్చిన కిన్నెరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంఠమనేని రాజగోపాల్, కమలా నెహ్రూ మహిళా మండలి సభ్యురాలు హనుమాన్ల రాణి కుమారి, సహకరించిన ప్రతి ఒక్కరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడకు చెందిన సప్తా ఫౌండేషన్ చైర్మన్ శరత్ బాబు, చల్లపల్లి మండలం ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్ వేములపల్లి సురేష్, వక్కలగడ్డ గ్రామ ప్రముఖులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మల్లు పెద్ది బోసు, పాలడుగు రత్నబాబు, మల్లు పెద్ది రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు

## నేడు మండల పరిషత్ సమావేశం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు (గురువారం) మధ్యాహ్నం 3 గంటలకు జరుగనుంది. మండల పరిషత్ అధ్యక్షులు కొడాలి సురేష్ అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారని, మండలంలోని వివిధ శాఖల అధికారులు అందరూ తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపిడిఓ టి.విజయసారధి కోరారు

# 36లక్షల విలువైన మొబైల్ ఫోన్స్ బాధితులకు అందజేసిన ఎస్పీ





**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా ఎస్పీగా ఆర్. గంగాధరరావు బాధ్యతలు చేపట్టాక గతంలో 45 లక్షలు విలువ కలిగిన 392 సెల్ ఫోన్లు, యంయం టీ ఎస్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగింది.మీ మొబైల్ పోయినట్లైతే మీరు మీ ఇంటి వద్దనే కూర్చొని 9490617573 వాట్సాప్ నెంబర్‌కి హై లేదా హెల్ప్ అని మెసేజ్ పెట్టి మొబైల్ ఫోన్ కు సంబంధించిన వివరాలు పంపితే చాలు పోగొట్టుకున్న మీ మొబైల్ ని రికవరీ చేసి మీకు అందిస్తాం,మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా కృష్ణాజిల్లా పోలీసు వారు అందిస్తున్న ఈ సేవలను వినియోగించుకోవాలి. జిల్లా ఎస్పీ తెలిపారు ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు సెల్ ఫోన్ లేనిదే జీవిత ప్రయాణం సాగడం లేదు. అటువంటి మొబైల్ ఫోన్లో చేజర్చుకోవడమో, దొంగిలించబడడమో, ప్రయాణాలలో మర్చిపోవడమో జరుగుతుంది. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్ల మిస్సింగ్ కేసులు ఎక్కువైనందున పోగొట్టుకున్న మొబైల్స్‌ను బాధితులకు అందజేసే నిమిత్తం జిల్లా ఎస్పీ ఆర్. గంగాధరరావు ప్రత్యక్ష పర్యవేక్షణలో ఐటీ కోర్ సిబ్బంది, సీ సీ ఎస్ సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఒక ప్రత్యేక యంయంటీఎస్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మిస్సింగ్ మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేశారు. అందులో భాగంగా గౌరవ ఎస్పీ ఆర్. గంగాధరరావు యం యం టీ యస్ అప్లికేషన్స్ ద్వారా పోగొట్టుకున్న, చోరీకి గురైన 45 లక్ష లు విలువ కలిగిన 392 సెల్ ఫోన్లు ద్వారా రికవరీ చేసి బాధితులకు అందించారు. అదేవిధంగా బుధవారం సుమారు 36 లక్షల రూపాయల విలువ చేసే 310 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. బుధవారం గుడివాడ సిసిఎస్ ద్వారా 175, పెనమలూరు సిసిఎస్ ద్వారా 83, బందరు సిసిఎస్ ద్వారా 52 సెల్ఫోన్లను రికవరీ చేసి మొత్తంగా 310 సెల్ఫోన్లను ఎస్పీ చేతుల మీదుగా భాదితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆర్ గంగాధర రావు మాట్లాడుతూ, ఈ మొబైల్ యం యం టీ యస్ అప్లికేషన్ ను ప్రజలు అందరూ వినియోగించు కోవాలని,ఫోన్ చోరీకి గురైనా,పోగొట్టుకున్న వారు వాట్సాప్ నంబర్ 9490617573 హై లేదా హెల్ప్ అని మెసేజ్ పంపి, మొబైల్, ఇతర సమా చారం అందులో తెలియపరచి యం యం టీ ఎస్, సేవలను పొందవచ్చు. ఈ విధానము ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటుంది. దీనిని ప్రజలు సద్వినియోగ పరుచుకొని పోగొట్టుకున్న మొబైల్స్ ను తిరిగి పొందవచ్చు. ఎవరికైనా దొరికిన సెల్ ఫోన్‌లను సొంతానికి వాడుకోవడం కాని, గుర్తు తెలియని వ్యక్తులు ద్వారా బిల్లులు లేని సెల్ ఫోన్‌లను కొనడం కాని చేయకూడదు. మీకు దొరికిన సెల్ ఫోన్‌లను దగ్గరలో ఉన్న పోలీసు స్టేషన్‌కి అందజేయాలని తెలియజేశారు.దొంగతనం చేయలేదు కదా అని ఉపయోగిస్తే తద్వారా కేసులలో చిక్కుకోవాల్సి వస్తుందని తెలిపారు. అనంతరం మొబై ల్ ఫోన్లు పోగొట్టుకున్న వారితో స్వయంగా మాట్లాడి వారి చేతుల మీదుగా మొబైల్స్ అందజేశారు.310 సెల్ఫోన్లు రికవరీ చేసి బాధితులకు అందించడంలో కృషి చేసిన సిసిఎస్, ఐటి కోర్ సిబ్బందిని ఎస్పీ అభినందించి, రివార్డ్స్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో,అడిషనల్ ఎస్పీ వివి నాయుడు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ బి. సత్యనారాయణ, సీ సీ ఎస్ ఇన్స్పెక్టర్స్ రమణమ్మ, గోవిందరాజులు, కె.ప్రసాద్, ఐటి కోర్ ఎస్ఐ వి. వెంకటేష్, కానిస్టేబుల్ కొప్పాడి నాగరాజు సిసిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 7నుండి గుడ్లవల్లేరు సత్యనారాయణ స్వామివారి బ్రహ్మోత్సవాలు



**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** కృష్ణా జిల్లా, గుడ్లవల్లేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 7 శుక్రవారం నుండి 12 బుధవారం వరకు స్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు, ఉత్సవాలను గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము ప్రారంభిస్తారని దేవస్థానం పాలకవర్గ కమిటీ ఛైర్మన్ కొప్పురావూరి రవీంద్ర తెలిపారు. 7వతేదీ శుక్రవారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 10 గంటలకు శ్రీవారిని పెండ్లికుమారుని చేయుట సాయంత్రం 6 గంటలకు విష్ణక్షేనపూజ, పుణ్యాహవచనము, అంకురా రోపణ, ధ్వజారోహణము, 8వతేదీ స్థిరవారం ఉదయం నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలు తెల్లవారుజామున శ్రీ సత్యనారాయణస్వామి వారి వ్రతములు సాయత్రం నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలు, 9వతేదీ ఆదివారం ఉదయం సాయత్రం నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలు మధ్యాహ్నం 3 గంటలకు భగవద్గీత ప్రవచనం, పారాయణం, రాత్రి 7 గంటలకు శ్రీ స్వామివారి రాయబార మహోత్సవము, 10వతేదీ సోమవారం ఉదయం 5 గంటలకు నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలు ఉదయం 9 గంటలకు అష్టోత్తర శత కల శస్థాపన 108 కలశాలతో విశేష అభిషేకం మధ్యాహ్నం 3 గంటలకు " శ్రీ సీతారామ కళ్యాణం" చెప్పబడును. రాత్రి 7 గంటలకు శ్రీ స్వామివారి తిరు కళ్యాణోత్సవము, 11వతేదీ మంగళవారం నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలు సాయంత్రం 4 గంటలకు శ్రీ స్వామివారి గరుడోత్సవము, 12వతేదీ బుధవారం ఉదయం, సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ, విశేష అర్చనలు ఉదయం 9.గంటలకు శ్రీ చూర్ణోత్సవం, కొట్నాలు చక్రస్నాం, మహా పూర్ణాహుతి, అవబృదోత్సవం సాయత్రం 5 గంటలకు కోలాటం రాత్రి 7 గంటల నుండి శ్రీ స్వామివారి పవళింపు సేవలు, 13వ తేదీ గురువారం భారీ అన్నసమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలతో స్వామివారి బ్రహ్మోత్సవాలను భక్తజన బృందం, నెహ్రూ పశువుల సంత, గ్రామాభివృద్ధి సంఘం, సంత వ్యాపారుల సౌజన్యంతో ఘనంగా నిర్వహిస్తున్నట్లు, భక్తజనులు అశేషంగా పాల్గొని బ్రహ్మోత్సవాలు జయప్రదంచేసి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని పాలకవర్గం ఛైర్మన్ కె రవీంద్ర, సభ్యులు మురాల నరేష్, భలే కల్పన, కోడే శారద, కాగితం హరికృష్ణ, చిలంకుర్తి వెంకటేశ్వరరావులు కోరారు.

# అనాథ పిల్లలకు కొత్త జీవితాన్ని అందించండి : కలెక్టర్ బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఏ అనాథ బిడ్డ తల్లిదండ్రులు, కుటుంబం లేకుండా ఉండకూడదు అని, అలాంటి పిల్లలకు కొత్త జీవితాన్ని అందించేందుకు సహృదయులు ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన కలెక్టరేట్ లోని తన చాంబర్లో శిశు గృహ మచిలీపట్నంలో ఉంటున్న బాలుడిని కారా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా జిల్లా బాలల రక్షణ విభాగం డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వాసులు నోటం రవి, ఉషా దంపతులకు దత్తత ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలుడితో సరదాగా సంభాషించారు. నీ పేరు ఏమిటి. ఏం చదువుకుంటున్నావని ఆయన బాలుడిని అడగ్గా, నా పేరు చరణ్.అంగన్వాడీ బడిలో చదువుకుంటున్నానని సమాధానం ఇచ్చాడు. బాలుడుని బాగా చూసుకొని, మంచిగా చదివించాలని దత్తత తీసుకున్న జంటకు సూచించారు.బాలుడిని దత్తత తీసుకోవడానికి ముందుకు వచ్చిన వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పిడి ఎం ఎన్ రాణి, డిసిపిఓ మోనిషా, సి డబ్ల్యూ సి చైర్ పర్సన్ సువార్త, పిఓ ప్రశాంతి, ఈవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించాలి




**వత్సవాయి,ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్ :** కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి బి.రాము మాట్లాడుతూ స్వాతంత్ర్యం ముందు నుంచి కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. కోవిడ్ కాలంలో దుర్మార్గంగా పార్లమెంట్లోను, బయట ఎటువంటి చర్చ జరగకుండా 2019లో వేతనాల కోడ్, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక ఎ భద్రత కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్లను ఆమోదించింది. రెండు రోజుల్లో రాష్ట్రపతి ఆమోదం పొందింది. రూల్స్ ను ఆమోదించింది. మోడీ ప్రభుత్వంలో అమలు చేయడానికి సిద్ధంగా ఉంది. ఏనాడైనా అమలు ఉత్తర్వులు ఇస్తామని ఇటీవల ఆర్థికశాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రీ బడ్జెట్ సమావేశంలో కార్మిక సంఘాల నాయకుల సమక్షంలో ప్రకటించగా వారంతా తీవ్రంగా వ్యతిరేకించన గానీ ప్రభుత్వం మొండిగా ఉందని అన్నారు. కార్మికవర్గానికి ప్రస్తుతం వున్న కొద్దిపాటి హక్కులను కుదించడమే లేబర్ కోడ్స్ ముఖ్య ఉద్దేశం అని అన్నారు. సరళీకరణ విధానాల అమలులో భాగంగా ప్రస్తుత కార్మిక చట్టాలు తమకు అడ్డంకిగా ఉన్నాయని వాదిస్తున్నారు. కార్మిక హక్కు లు కాలరాసి పెట్టుబడిదారులకు పెద్దపీట వేయడానికి లేబర్ కోడ్స్ వచ్చాయి అని అన్నారు. లేబర్ కోడ్లు ఇంకా అమలులోకి రాకుండానే పరోక్షంగా అమలు చేస్తున్నది. లేబర్ కోడ్స్ అమలులోకి తెచ్చి కార్మికవర్గాన్ని కట్టుబానిసలుగా పనిచేయించి దోపిడీని మరింత తీవ్రతరం చేయబోతున్నదని అన్నారు. అందుకే యావత్తు కార్మికవర్గాన్ని లేబర్ కోడ్ల ప్రమాదాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధం అవుతుందని అన్నారు. పోరాటం ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జానీ,ప్రసాద్,లుర్దు, వెంకటరమణ, కాజా, నాజ్,శ్రీనివాస్ రావు, కాసిం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో చట్టబద్ధత కల్పించాలి

## ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మయ్య మాదిగ

**విజయవాడ మేజర్ న్యూస్ :** గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట కో కన్వీనర్ మానికొండ శ్రీధర్ మాదిగ అధ్యక్షతన ముఖ్య అతిథిగా వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుకు స్పందించిన రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సమస్య పరిష్కార దిశగా తెలంగాణా లో జస్టిస్ షమీమ్ అక్తర్ కమీషన్ ను ఏర్పాటు చేయడం అలానే ఆంధ్ర ప్రదేశ్ లో కూడా జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ నివేదిక ఆధారంగా వర్గీకరణ విషయంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని వర్గీకరణ నివేదికను శాసన సభలో ప్రవేశ పెట్టి గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3లుగా మాదిగ, మాదిగ ఉపకులాలను, మాల – మాల ఉపకులాలను, ఇప్పటి వరకు రిజర్వేషన్ పొందని ఉప కులాలను 3 గ్రూపులుగా ఏర్పాటు చేసి 30 సం.ల ఎంఆర్పీఎస్ పోరాట ఫలితంగా అసెంబ్లీ లో ప్రవేశ పెట్టడం నిజంగా హర్షించదగ్గ విషయమని, ఎందరో ముఖ్యమంత్రులు చేయలేని సామాజిక న్యాయాన్ని తెలంగాణాలో చేసినందుకు ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డికి ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధినేత ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలంగాణ మాదిగ జాతి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసారు. అలాగే ప్రస్తుతం ఆంధ్ర ప్రదేశ్ లో కూడా జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రిపోర్ట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు త్వరగా నివేదిక తెప్పించుకుని ఆంధ్ర ప్రదేశ్ లో కూడా ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే విధంగా సత్వర చర్యలు తీసుకోవాలని



గతంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న జిల్లాల యూనిట్ గా వర్గీకరణ కాకుండా జస్టిస్ రామ చంద్ర రాజు కమిషన్ నివేదిక ఆధారంగా రాష్ట్రం యూనిట్ గానే వర్గీకరణకు చట్ట బద్ధత కల్పించాలని కోరడమైనది. జిల్లా యూనిట్ గా వర్గీకరణ జరిగితే మాదిగ, నడిగా ఉపకులాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రకటించిన జిల్లా యూనిట్ గా కాకుండా రాష్ట్ర యూనిట్ గానే వర్గీకరణను చేపట్టి త్వరగా మంత్రి వర్గంచే ఆమోదింపజేసి అసెంబ్లీలో చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో ఎంఆర్పీఎస్ కోఆర్డినేటర్లు పానుగంటి షాలెం రాజ్ మాదిగ, మానికొండ శ్రీధర్ మాదిగ, ఏటుకూరి విజయ్ కుమార్ మాదిగ, స్టేట్ లీగల్ సెల్ కన్వీనర్ చిలువూరు నాగ రాజు మాదిగ, కొమరాల శ్రీనివాస రావు మాదిగ, వలేటి భూషణం మాదిగ, కిన్నెర నాగ రాజు మాదిగ, కారుమూరి బెర్నార్డ్ మాదిగ, కాసుకుర్తి నవీన్ మాదిగ, నలుకూర్తి కోటేశ్వరరావు మాదిగ సిద్దెల ఇశ్రాయేల్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవాలకు రైతులకు ఆహ్వానం





**పామర్రు ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్ :** కృష్ణాజిల్లా పాల ఉత్పత్తిదారుల సహకార సమితి (కృష్ణా మిల్క్ యూనియన్) ఈనెల 11వ తేదీ నుండి వజోత్సవాలను నిర్వహిస్తున్నట్లు యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి జిల్లాలో ముందుగా పామర్రు మండలం జమీగొల్వేపల్లిలో రైతులను ఆహ్వానించేందుకు విచ్చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా జమీగొల్వేపల్లి లోని పాల సేకరణ కేంద్రం వద్ద రైతులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లా డుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మొట్టమొదటిసారిగా పామర్రులో 1965 ఫిబ్రవరి 11వ తేదీన పాల సేకరణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం 1200 గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి తద్వారా 12 కోట్ల లీటర్ల పాల సేకరణతో దిన దిన ప్రవర్ధమానమైందన్నారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రభుత్వ రంగ సంస్థ నుంచి మ్యాక్స్ చట్టంలోకి తీసుకురావడం, అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గోల్డెన్ షేక్ హ్యాండ్ పథకం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రూ.16 కోట్లు నిధులు తీసుకురావడంతో యూనియన్‌కు అంకురార్పణ జరిగిందన్నారు. 1965లో ఒక ఫ్యాక్టరీ ఉంటే.. ఇప్పుడు హనుమాన్ జంక్షన్ లో రూ.200 కోట్లతో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి రైతులను లాభాల బాటలో పయనింపజేస్తున్నామన్నారు. గ్రామాల్లో పాడి రైతులు ఆనందంగా ఉంటేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. అందుకోసం తమ యూనియన్ ద్వారా పశు సంక్షేమం కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. పాడి రైతుల సంక్షేమం, పాడి పశువుల సంక్షేమం, వినియోదారుల ఆరోగ్యం, ఉద్యోగుల సంక్షేమం కార్యక్రమాలు నాలుగు మూలస్తంభాలుగా నిలబడటంతో కృష్ణా మిల్క్ యూనియన్ భారతదేశ వ్యాప్తంగా వజ్రోత్సవాలు జరుపుకునే స్థితికి చేరుకుందన్నారు. ముందుగా చైర్మన్ ఆంజనేయులు పాలకవర్గ సభ్యులు, రైతులతో కలిసి కేక్ కట్ చేసి సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరరావు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అన్వేష్ కుమార్, యూనియన్ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గోళ్ళ పూర్ణ మల్లికార్జునరావు, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, పామర్రు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ దామోదర కృష్ణ గోపీనాథ్, యూనియన్ పాలకవర్గ సభ్యులు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ గ్రామానికి చెందిన యూనియన్ మాజీ అధ్యక్షుడి వల్లభనేని రాజేంద్రబాబును ప్రస్తుత అధ్యక్షుడు ఆంజనేయులు సత్కరించారు.



## జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

**ఏ.కొండూరు, మేజర్ న్యూస్:** మండలంలోని ఖమ్మంపాడు జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయిలో జరిగే క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎస్సై చల్లా కృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలు శరీర దారుణ్యానికి ఎంతో మంచిదని పోటీల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ఈ పోటీల్లో క్రీడాకారులు నియమ నిబంధనలు పాటించి గొడవలు జరగకుండా పోటీలు నిర్వహించాలని కమిటీ వారికి సూచించారు. దాతలు ప్రథమ బహుమతి 30 వేల రూపాయలు ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, వైఎస్ఆర్సిపి మండల యూత్ అధ్యక్షులు కాలసాని చెన్నారావు, ద్వితీయ బహుమతి 20వేల రూపాయలు బొబ్బ సురేష్ గోపాలపురం, తృతీయ బహుమతి పదివేల రూపాయలు మాధవరం వైఎస్ఆర్సిపి నాయకులు కుక్కల వైకుంఠరావులు అందిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఈ బహుమతులు అందజేస్తారు

## శ్రీ వసంత వేణుగోపాల స్వామికి విశేష పూజలు



**కంచికచర్ల ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్:** భీష్మాష్టమి సందర్భంగా బుధవారం గొట్టుముక్కుల లో కొలువై ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ముత్తేవి కేశవ బాబు పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులను స్వామివారి అలంకరణ ప్రత్యేకంగా కట్టుకుంది. స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మ వారలను దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు. దేవాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భీష్మ ఏకాదశి, ద్వాదశి సందర్భంగా ఈనెల 10న స్వామివారికి ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ అర్చకులు తెలిపారు.

## ట్రాఫిక్ రూల్స్‌ని తప్పక పాటించాలి

### ఇంధన శకట తనిఖీ అధికారి ఎంవిఎన్ రాజు



**జగ్గయ్యపేట,ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్ :** మండలంలో బూదవాడ గ్రామంలో అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా ఇంధన శకట తనిఖీ అధికారి ఎంవిఎన్ రాజు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం కోసం ప్రతి డ్రైవర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాహనాల ట్రాఫిక్ రూల్స్‌ని తప్పక పాటించాలన్నారు. లారీలు,ట్రక్కులు, ట్యాం కర్లకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని కాగితాలు ఫోర్స్ లో ఉంచుకోవాలని, ఇన్సూరెన్స్,పొల్యూషన్,ఫిట్నెస్ ని సైతం ఫోర్స్ లో ఉంచుకోవాలని ఆయన అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అతివేగంగా వాహనాలు నడప వద్దని, పరిమితికి మించి సరుకులను లోడింగ్ చేయవద్దని ఆయన అన్నారు. మైనర్లకు నడపడానికి వాహనాల ఇవ్వడం చట్ట రీత్యా నేరమని అన్నారు.కుటుంబ బాధ్యతలలో భాగంగా సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతాను పాటించి సురక్షితంగా ఇంటికి చేరాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో యంవిఐ కార్యాలయం సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ షేక్ ఆలాం, శరత్ చంద్ర, అల్ట్రా టెక్ సిమెంట్ యూనిట్ హెడ్ శివరాజు,అల్ట్రా టెక్ హెడ్ సౌరవ్ గంగూలీ తదితరులు పాల్గొన్నారు



## చైర్‌పర్సన్ కృష్ణకుమారిని సన్మానించిన మాజీ మంత్రి



**నందిగామ, ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్:** మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, శ్రీనివాస రావులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావుని గొల్లపూడి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండవ కృష్ణకుమారి కి దేవినేని ఉమ దుస్సాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్లకు అండగా టీఎస్ఆర్

### పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీకి లక్ష రూపాయల చెక్కు అందజేత



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నాగాయలంక మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ వాక్యోపదేశకులకు టి ఎస్ఆర్ గ్రూప్ చైర్మన్ టి ఎస్ ఆర్ మినిస్ట్రీస్ అధినేత తిరుపతి శ్రీనివాస రావు బుధవారం లక్ష రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాక్యోపదేశకులు అందరూ ఐక్యంగా ఉండాలని వారికి ఎలాంటి అవసరం వచ్చినా తాను అండగా ఉంటానని చెప్పారు అలాగే ప్రార్థన మందిరాలు నిర్మాణాలకు తన సహాయ సహకారాలు అందజేస్తానన్నారు. నాగాయలంక మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు మండలి కిరణ్ బాబు మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలోనే కాదు రాష్ట్రంలోని పాస్టర్స్ అందరికీ కూడా తిరుపతి శ్రీనివాసరావు సహాయ సహకారాలను అందిస్తున్నారని, నియోజవర్గంలో ఆరు మండలాల పాస్టర్స్ అసోసియేషన్ ఏర్పడితే 6 మండలాలకు 6 లక్ష రూపాయలు చెక్ ను అందిస్తానని హామీ ఇచ్చారని ఇప్పటికే కోడూరు మోపిదేవి మండలాల ఇవ్వగా బుధవారం నాడు నాగాయలంక మండలానికి అందించారని తెలిపారు. ప్రార్థన మందిరాల నిర్మాణాలకు కూడా తిరుపతి శ్రీనివాసరావు సహాయ సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వాక్యోపదేశకులు కోట కరుణ్ కుమార్, నాగాయలంక పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు, దైవ సేవకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు వైఎస్సార్ జిల్లా రచయితల ఆహ్వానం

### ఈ నెల 8,9 తేదీల్లో కడపలో "వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం - రాయలసీమ భాగస్వామ్యం" అంశంపై మహాసభలు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** వైయస్సార్ జిల్లా రచయితల సంఘం రెండవ సాహిత్య సాంస్కృతిక మహాసభలకు అవనిగడ్డ ఎమ్మెల్యే, ప్రపంచ తెలుగు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు, నవ్యాంధ్ర తొలి ఉప సభాపతి, ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి డాక్టర్ మండలి బుద్ధప్రసాదుకు ఆహ్వానం లభించింది. ఈ నెల 8,9 తేదీల్లో వైఎస్ఆర్ జిల్లా కడపలోని శంకరాపురం ఐఎంఏ హాల్లో "వెయ్యేళ్ల తెలుగు సాహిత్యం – రాయలసీమ భాగస్వామ్యం" అంశంపై మహాసభలు ఏర్పాటు చేశారు. తొలిరోజు సాహితీ సమరాంగణ సార్వభౌమ శ్రీకృష్ణ దేవరాయల సభా వేదికపై జరిగే మహాసభల ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ విచ్చేయనున్నారు. ఈ సభకు హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షులుగా వ్యవహరించనున్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో గుండెపోటుకు అందుబాటులో చికిత్స

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గుండె పోటుకు చికిత్స అందుబాటులో ఉందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం జై కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఛాతి నొప్పి వచ్చినప్పుడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ఈసీజీ తీసి విజయవాడ ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ గుండె వైద్యుల సూచనల మేరకు అవసరం అయిన వారికి రక్తనాళంలో గడ్డకట్టిన రక్తమును కరిగించేటందుకు మొదటి గంటలోనే 45వేల రూపాయలు విలువగల కెనో 50 ప్లస్ ఇంజక్షన్ ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. అనంతరం విజయవాడ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ కి హాస్పిటల్‌లో గుండె విభాగానికి ప్రత్యేకమైన అంబులెన్స్ లో తరలించడం జరుగుతుందన్నారు.ఈ సదుపాయాన్ని అవనిగడ్డ పరిసర ప్రాంతాల ప్రజల అందరికీ తెలియజేస్తున్నామని అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు గుండెపోటు లక్షణాలు వివరించారు. ఛాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, ఆకస్మిక గుండె దడ స్పృహ కోల్పోవడం వంటి కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి అన్నారు.

# మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం నూతన అధ్యక్షునిగా లంకిశెట్టి బాలాజీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం నూతన అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక ఈడేపల్లి దివ్యజ్ఞాన సమాజం భవనంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో బాలాజీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా సీనియర్ ఆడిటర్ సి. శేషాచార్యులు (అప్పాజీ)ని ఎన్నుకున్నారు. ఇప్పటివరకు అధ్యక్షునిగా పనిచేసిన ఆడిటర్ అప్పాజీ మాట్లాడుతూ వారణాసి ముఖ్య కేంద్రంగా భారతదేశంలోని అన్ని జిల్లా ముఖ్య కేంద్రాలలో పనిచేస్తున్న దివ్యజ్ఞాన సమాజం గత 150 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహించిందని తెలియజేశారు. సమాజంలో దిగజారిపోతున్న నైతిక విలువలను కాపాడటంలో దివ్యజ్ఞాన సమాజం నిరంతరం కృషి చేస్తుందని తెలియజేశారు.రాబోయే రోజులలో మచిలీపట్నంలోని విద్యాసంస్థలలో దివ్యజ్ఞాన సమాజం ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులలో నేర ప్రవృత్తిని తొలగించి నైతిక విలువలు పెంచడానికి కృషి చేయటం జరుగుతుందని అప్పాజీ అన్నారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన లంకిశెట్టి మాట్లాడుతూ భారతదేశంలో పేరు ప్రతిష్టన్న సంస్థకు అధ్యక్షునిగా సేవ చేసే భాగ్యం తనకు దక్కిందని అన్నారు. గతంలో ఎందరో మేధావులు అధ్యక్షుడిగా పనిచేసి అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని బాలాజీ అన్నారు.నేటి సమాజంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా దివ్యజ్ఞాన సమాజం సిద్ధాంతాలు అత్యంత అవసరమని బాలాజీ అన్నారు. దివ్యజ్ఞాన సమాజం ద్వారా అందించిన జ్ఞానం చరిత్రలో స్థిరంగా ఉండిపోతుందని సొసైటీ కార్యదర్శి కొత్తగుండు రమేష్ అన్నారు. సంస్థకు చెందిన విలువైన ఆస్తులు ఇతరుల చేతులలో ఉన్నాయని వాటిని తిరిగి తీసుకోవడం కోసం చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. చలసాని సుబ్బారావు డాక్టర్ కుప్ప వెంకట రామశాస్త్రి. వేమూరి నరసింహారావు. ఎం.వి సుబ్బారావు వంటి మచిలీపట్నం ప్రముఖులు ఈ సమాజానికి సేవలు అందించారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమాజం కోశాధికారి ఎం. సత్యనారాయణ హిందూ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు సవరం వెంకటేశ్వరరావు, న్యాయవాది గుడిసేవ మురళీధర్, కార్యవర్గ సభ్యులు ఎం ఎస్ వి ప్రసాద్, వై చలపతిరావు, ఎన్. నాగమల్లేశ్వరమ్మ, ఎస్ విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ పట్టభద్రులు ఎన్నికల్లోకూటమి అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మాజీ జడ్పిటిసి కొల్లూరి వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జూనియర్ కాలేజీలో, కూటమి నాయకులు మాజీమంత్రివర్యులు, సౌమ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు. గత జగన్ ప్రభుత్వం పై కలిసికట్టుగా పనిచేసే సార్వత్రిక ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడించారు. అదే స్ఫూర్తితో పట్టభద్రుల ఎన్నికల్లో చిత్తు చేసి చూపిద్దామన్నారు.. ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రథమ ఓటు వేసేలా ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని కోరారు.. వైసీపీ ప్రభుత్వంలో చట్టసభల్లో గౌరవాన్ని దిగజార్చారని యువతకు 20 లక్షలు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వము, సూచించిన ఆలపాటిని గెలిపించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు నిత్యం అందుబాటులో ఉండే వ్యక్తి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ని తెలియజేస్తూ మొదటి ప్రాధాన్యత ఓటుతోనే గెలిపించాలని కోరుతూ... ఇంటింటికి ప్రచారం చేస్తూ అవనిగడ్డ హై స్కూల్, జూనియర్ కాలేజీల్లో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బండే కనకదుర్గ, బచ్చు కృష్ణకుమారి, కూనపురెడ్డి చంద్రశేఖర్, కొట్టె విజయ్, గుడివాక మల్లికార్జునరావు, కమ్మిలి సుబ్రహ్మణ్యం, గొల్లపూడి శ్రీనివాసరావు, కొండవీటి పాండురంగారావు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య ప్రముఖుడు దేసు జగన్ మోహన్‌కి ఘన సన్మానము



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** ఆర్యవైశ్య ప్రముఖులు, బిజెపి నేత దేసు జగన్ మోహన్ రావు 86వ జన్మదిన వేడుకలు వైభవంగా జరిగాయి. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం జరిగిన వేడుకలలో పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై దేసు జగన్మోహన్ ను ఘనంగా సత్కరించారు. జగన్ మోహన్ రావు కుమారులు ఆయనకు పాదపూజ నిర్వహించగా పేద పండితులు సుత్తి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలోని బృందం ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జగన్మోహన్రావు ఏ రంగంలో ఉన్న క్రమశిక్షణతో అంకితభావంతో పనిచేస్తారని వ్యాపార వర్గాల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుంటారని అభినందించారు. ఆర్యవైశ్య ప్రముఖులు కోడూరు నరసింహారావు, చన్నగిరి పాండురంగారావు, మానేపల్లి కోటయ్య, ఘంటసాల రాజామోహన్రావు, బిజెపి నేతలు తుంగల మురళీకృష్ణ,మునగాల బాలకృష్ణారావు ఆర్ఎస్ఎస్ నేతలు కోలా శ్రీమన్నారాయణ, దేశు శేషగిరిరావు చెన్నగిరి ఆంజనేయులుతో పాటు పలువురు పాల్గొని నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు.

## జగనన్న కాలనీ అడవిమయం



**కంచికచర్ల ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్ :** గొట్టుముక్కల గ్రామంలో జగనన్న కాలనీ అడవిని తలపిస్తుంది. నివేషణ స్థలాలు లేని వారికి గత వైసీపీ ప్రభుత్వంలో ఇచ్చిన నివేషణ స్థలాలు పూర్తిగా సర్కారు కంపతో నిండి పోయి అడవి మయంగా మారి విష సర్పాలకు నిలయంగా తయారయింది. గ్రామంలో సుమారు 200 మంది లబ్ధిదారులకు ఇక్కడ ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారు. ఈ స్థలం నివేశన స్థలాలకు పనికిరాదని రెండు వాగుల మధ్య ఒక డొంక మధ్య లో ఉందని వర్షాకాలం వరద పడుతుందని లబ్ధిదారుల మొత్తుకున్నా సరే పట్టాలిచ్చారు. అప్పటి మాజీ ఎమ్మెల్యే జగన్ మోహన్ రావు నాటి ఎమ్మార్వో రాజకుమారి వీరి గోడు పట్టించుకోకుండా బలవంతంగా పట్టాల పంపిణీ చేశారు. అయితే గ్రామానికి దూరంగా రెండు వాగుల మధ్య వర్షాకాలం వరదలతో సరస్సు లా కనిపించే ఈ స్థలాలను లబ్ధిదారులు స్వాధీనం చేసుకోలేదు. దీంతో గత రెండు సంవత్సరాలుగా ఈ పొలంలో సర్కార్ కంప పుట్టి 12 అడుగుల ఎత్తుకు పైగా పెరిగి పెద్ద అడివి లా మారిపోయింది. ఈ స్థలాల పట్టాలను రద్దుచేసి ఈ పొలాన్ని ప్రభుత్వం మరొక కార్యక్రమానికి వినియోగించుకొని గ్రామాన్ని ఆనుకొని ఉన్న మేరక పొలాలలో తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని లబ్ధిదారులు కూటమి ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

## స్పందించే హృదయమే స్పందన



**గన్నవరం, ఫిబ్రవరి 5, మేజర్ న్యూస్ :** స్పందించే హృదయమే స్పందన అని ఎంతోమంది మానసిక దివ్యాంగుల జీవితాలకు వెలుగు నింపుతున్న గొప్ప సంస్థ హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అని ఎన్.టి.ఆర్ జిల్లా ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ కోర్డినేటర్ అరవ రమేష్ అన్నారు. గన్నవరం మండలం దావాజీగూడెం లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పందన మానసిక వికాస కేంద్రాన్ని బుధవారం రమేష్ సందర్శించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్పందన లో మానసిక దివ్యాంగులకు ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాలు అందించడం చాలా గొప్ప సేవని ఆయన అన్నారు. మానసిక దివ్యాంగులను సొంత బిడ్డలు వలె బాగోగులు చూస్తున్న సంస్థ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్ ను రమేష్ అభినందించారు. కరోనా క్లిష్టమైన సమయంలో, విజయవాడ లో బుడమేరు వరద బాధితులకు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ సేవలు అమోఘమని ఇలాంటి సంస్థలకు ప్రతి ఒక్కరూ అండగా ఉండవలసిన అవసరం ఉందని రమేష్ పిలుపునిచ్చారు. అనంతరం రిపబ్లిక్ డే నాడు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న రమేష్ ని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ తరుపున సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలి






## ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, శాప్ ఛైర్మన్ రవినాయుడు

**విజయవాడ, మేజర్ న్యూస్ :** కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీలు బలపరిచిన అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను చరిత్రలో నిలిచేలా అత్యధిక వోట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు, శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ బుధవారం సాయంత్రం తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఫ్రైడ్ మాధవ్ హోటల్‌లో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా శాప్ ఛైర్మన్ రవినాయుడు హాజరై మాట్లాడారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ కరపత్రాలను విడుదల చేశారు. రవి నాయుడును గద్దె క్రాంతికుమార్ పూలబొకె ఇచ్చి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పోటీలో లేనప్పటికి ఈ ఎన్నికలను తేలికగా తీసుకోకూడదన్నారు. సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా చదువుకున్న పట్టభద్రులు ఓటింగ్‌లో పాల్గొంటారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెల కాలంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయని, కూటమి పాలనకు ఈ ఎన్నికలు ఒక పరీక్ష అని తెలిపారు. జాబితాలోని ప్రతి ఓటరును కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గతంలో చేసిన పనులను, ఎమ్మెల్సీ అయిన తర్వాత చేయబోయే పనులను వివరించాలని కోరారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా చూడాలని పిలుపునిచ్చారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు గురించి దేశంలో రాష్ట్రంలో చర్చించుకునే స్థాయిలో భారీ మెజారిటీ సాధించాలని కోరారు. ఎమ్మెల్సీ ఓటింగ్‌పై నాయకులు ముందుగా అవగాహన కల్పించుకోవాలని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో అత్యధికులు చదువుకున్న వారు ఉన్నారని, వారందరినీ కూటమిలోని నాయకులు ముందుగానే కలిసి ఓటుగా మలచుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారిని ఎలా సంప్రదించాలనే అంశాలను ఆలోచించాలని, కూటమిలోని ప్రతి నాయకుడు, ప్రజాప్రతినిధి ఓటర్లను కలిసి వివరించాలన్నారు. తూర్పు నియోజకవర్గంలోని డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లోని విద్యార్థులను కలిసి వివరించాలన్నారు. సచివాలయాలు, ఆర్టీసీ సంఘాల ప్రతినిధులను, వాకర్స్ తో పాటు పలువురిని ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ కలిసి ప్రచారం చేయాలని సూచించారు. 1వ నెంబరు ప్రాధాన్యత ఓటు ద్వారానే ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయం సాధించేలా సమిష్టి కృషితో ముందుకు వెళ్ళాలన్నారు.

సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ అశోక్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లాలోని 33 నియోజకవర్గాల్లోని ప్రతి ఓటరును అభ్యర్థి స్వయంగా కలిసి ఓట్లను అభ్యర్థించడం సాధ్యం కాదని, అందువల్ల కూటమిలోని ప్రతి ఒక నాయకుడు స్వయంగా ఓటర్లను కలిసి వివరించాలన్నారు. పోలింగ్ జరిగే రోజు ఓటరు నియోజకవర్గంలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆ రోజు తప్పకుండా ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా చూడాలని కోరారు. తూర్పు నియోజకవర్గంలోని 21 డివిజన్లలోని ఓటర్ల జాబితాను పరిశీలించి ఓటర్లను కలిసి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రతి ఓటరును కనీసం పదిసార్లు కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటును ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వేసేలా చూడాలన్నారు. చరిత్రలో నిలిచిపోయేలా ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు ఉండాలని అన్నారు. జనసేన తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసమే పవన్ కళ్యాణ్ కూటమిలో కలిశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ తన సీటును త్యాగం చేశారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే గద్దె రామమోహన్ గెలుపునకు ఎంత కసిగా జనసేన సైన్యం పనిచేశారో, ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అంతే కసిగా పనిచేసి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని అన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ బీజేపీ నాయకులు కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని చెప్పారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసే విధంగా చూడాలని అన్నారు. మాజీ మంత్రిగా, పార్టీ క్రమశిక్షణకు కట్టుబడిన వ్యక్తి అని ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు రాష్ట్రంలో మంచి పేరు ఉందని తెలిపారు. పోలింగ్ రోజు ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

నియోజకవర్గ ఇన్చార్జ్ వెలగపూడి శంకర్ బాబు, గద్దె క్రాంతికుమార్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గానికి ఎం.ఎల్.సి పరిశీలకుడిగా రవి నాయుడు రావడం సంతోషంగా ఉందని, యువగళం పాదయాత్రను జయప్రదం చేసేందుకు రవినాయుడు కృషి అభినందనీయమని, ఆయన నేతృత్వంలో తూర్పు నియోజకవర్గంలో కూటమి పార్టీల సహకారంతో ఎం.ఎల్.సి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ను అత్యధిక వోట్ల మెజారిటీతో గెలిపించేందుకు కలిసికట్టుగా కృషి చేస్తామని తెలియజేశారు.

ఈ కార్యక్రమములో బొప్పన భవకుమార్, ఎస్.ఫిరోజ్, గన్నె వెంకట నారాయణ ప్రసాద్, తూమాటి ప్రేమనాథ్, కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, చెన్నుపాటి ఉషారాణి, పొట్లూరి సాయిబాబు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి కాంతిశ్రీ, ఇతర నాయకులు కోలపల్లి గణేష్, పోతిరెడ్డి అనిత, పోతంశెట్టి నాగేశ్వరరావు, నందిపాటి దేవానంద్, గాబ్రియేల్, రత్నం రమేష్, వేముల దుర్గారావు, సబ్బినేని కృష్ణారావు, పలువురు డివిజన్ పార్టీ అధ్యక్షులు కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు




## త్రీ సభ్య కమిటీచే ప్రత్యేక విచారణ జరిపించండి

### ఫిర్యాదుదారుడు మహమ్మద్ జావిద్


పి.వసంతరావు

**జగ్గయ్యపేట ఫిబ్రవరి 5 మేజర్ న్యూస్ :** పట్టణ పరిధిలో ఉన్న పోస్టల్ శాఖలో పనిచేస్తున్న పి.వసంతరావు పై ఎన్నికల నియమావళిని పాటించకుండా వైసీపీ పార్టీకి తరపున ప్రచారంలో పాల్గొనడం పై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు బుధవారం విచారణ చేపట్టడానికి వచ్చిన అధికారులు ఏకపక్షంగా వ్యవహరించి తనపై బెదిరింపులకు పాల్పడటం జరిగిందని ఫిర్యాదుదారుడు మహమ్మద్ జావిద్ పేర్కొన్నారు. బుధవారం జరిగిన విచారణలో విచారణాధికారి తనపై అసభ్యకరంగా మాట్లాడుతూ నిబంధనలు పాటించని వారికి వత్తాసు పలుకుతూ విచారణ చేపట్టడం పట్ల పలు అనుమానాలకు దారితీస్తుందని కనుక ఉన్నతాధికారులు త్రీ సభ్య కమిటీచే ప్రత్యేకంగా విచారణ చేపట్టి నిబంధనలు పాటించకుండా ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం ఖాతరు చేస్తూ తన విధులను సక్రమంగా నిర్వర్తించకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టిన పోస్ట్మాన్ పి. వసంతరావు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పోస్ట్ మ్యాన్ ఉద్యోగాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి రాజకీయ నాయకుడిగా చలామణి అవుతూ ప్రభుత్వంలో పైరవీలు చేసిన పోస్ట్ మెన్ పి.వి.వసంతరావు పై పోస్టల్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకొని విధుల నుండి తొలగించాలని ఆయన కోరారు.

# ఈట్ స్ట్రీట్‌లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించండి






**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన చంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యటనలో భాగంగా వేముల శ్యామల రోడ్, ఈట్ స్ట్రీట్, సింగ్ నగర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈట్ స్ట్రీట్ లో పారిశుద్ధ్య నిర్వహణ లో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, ప్రజలు ఆహారం సేవించే ప్రదేశమైనందున ఎల్లప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రజలకు అందించాలని, దానికనుగుణంగా అక్కడున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలిస్తూ, డిస్ ఇన్ఫెక్టంట్స్ వేసేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తదుపరి సింగ్ నగర్ అన్న కాంటీన్ పరిశీలించారు. అక్కడ వచ్చిన ప్రజలతో మాట్లాడి స్వయంగా ఆహార నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. కిచెన్ పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో పరిశీలించారు, తాగునీరు, వాడుక నీరు నిరంతరాయంగా రావాలన్నారు. నోడల్ ఆఫీసర్లు అందరూ తమ తమ అన్న క్యాంటీన్లోని ప్రతిరోజు వీక్షించి ఎటువంటి లోపాలు ఉన్న వెంటనే సరి చేయాలని, ఎటువంటి రిపేర్లు ఉన్న వెంటనే మరమ్మతులు చేయించేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారాలను ఆదేశించారు. ఈ పర్యటనలో చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జి వి జి ఎస్ వి ప్రసాద్, ఇంచార్జి మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, సూపరింటెండింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999